క్లుప్తంగా

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

ఆదోని అర్బన్: పట్టణంలోని 35వ వార్డు పంజరాపోల్ కాలనీలో గోవిందమ్మ అనే పేద వృద్ధురాలు మృతిచెందింది. విషయం తెలుసుకున్న యువనేత జయమనోజ్‌రెడ్డి, కౌన్సిలర్ లలితమ్మ, ఆమె భర్త వెల్లాల మధుసూదనశర్మ మృతదేహానికి నివాళులు అర్పించారు. మట్టి ఖర్చులకు రూ.4 వేలు ఆర్థిక సాయం అందజేశారు. నాయకులు కురువ రవికుమార్, అగ్గి రాముడు, అబ్రహం, సులోచనమ్మ తదితరులు పాల్గొన్నారు.

యువ కవి వీరేష్‌కు సన్మానం



సాహిత్య సమ్మేళనంలో దుంపాల వీరేష్

పెద్దకడబూరు: హిందూపురంలో కన్నడ సాహిత్య పరిషత్ నిర్వహించిన 8వ కన్నడ సాహిత్య సమ్మేళనంలో పెద్దకడబూరు మండల పరిధిలోని నాగులాపురం గ్రామానికి చెందిన యువ కవి దుంపాల వీరేష్‌ను సన్మానించారు. 'వలసలు' అనే అంశంపై కవితను అందజేసినట్లు ఆయన తెలిపారు. సాహిత్య పరిషత్ అధ్యక్షుడు అంజన్ కుమార్ జ్ఞాపికను అందజేసినట్లు చెప్పారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం ప్యాకెట్లతో సెబ్ పోలీసులు

కోసిగి: కోసిగి సెబ్ సర్కిల్ పరిధిలోని గవిగట్టు గ్రామ సమీపంలో అక్రమంగా మద్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు సెబ్ సీఐ మహబూబ్ బాషా, ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు. ఆదివారం కోసిగి సెబ్ సర్కిల్ పరిధిలో తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. గవిగట్టు సమీపంలో ఆదోని మండలం పెద్దతుంబళం గ్రామానికి చెందిన పెద్ద నరసయ్య, బోయ వీరేష్ బైక్‌పై 10 బాక్సుల్లో 960 ఒరిజినల్ చాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లు తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. బైక్‌ను సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పదవీ విరమణ ఉపాధ్యాయుడికి సన్మానం



ప్రతాప సూర్యను సన్మానిస్తున్న అపాస్ నాయకులు

ఆదోని సెంట్రల్: పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడు ప్రతాప సూర్యను ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఆదివారం స్థానిక విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమములో అపాస్ కోర్ కమిటీ ఎంపీ శ్రీనివాసులు మాట్లాడుతూ.. 35 ఏళ్లు వైఎంకే పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుడిగా ప్రతాప సూర్య పని చేశారన్నారు. ఇటీవల వర్క్ అడ్జస్ట్‌మెంట్ కింది ఉప్పరాల గ్రామానికి వెళ్లారని తెలిపారు. విద్యాభివృద్ధిలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అపాస్ నాయకులు సత్యనారాయణ, నాగస్వామి నాయక్, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

కౌతాళం: పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో పింఛన్లను పంపిణీ చేస్తామని ఎంపీడీఓ రఘునాథ్‌గుప్తా తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పింఛన్ల పంపిణీకి వలంటీర్లను దూరంగా ఉంచినట్లు చెప్పారు. వలంటీర్ల వద్ద ఉన్న డివైజ్‌లు, ఫోన్‌లు, ట్యాబ్‌లను స్వాధీనం చేసుకోవాలని కార్యదర్శులను ఆదేశించినట్లు తెలిపారు. సోమవారం నుంచి పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులతో పంపిణీ చేస్తామని తెలిపారు.

రేపటి నుంచి మారెమ్మవ్వ విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

తుగ్గలి: రోళ్లపాడు తండాలో ఈనెల 2వ తేదీ నుంచి వేద పండితులు బ్రహ్మశ్రీ గుండు వేణుగోపాలశాస్త్రి (బెల్డోణ స్వామి) ఆధ్వర్యంలో మారెమ్మవ్వ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆదివారం తండావాసులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 2, 3న ప్రతిష్ఠ పూజలు, హోమాలు, 4న మారెమ్మవ్వ దేవత విగ్రహ, నాగశిల, శిఖర ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.



శివశంకర్‌నగర్‌లో రూ.20 లక్షలతో నిర్మించిన సీసీరోడ్డు, మురుగు కాలువ



ఎస్కేడీ కాలనీలో వేసిన సీసీరోడ్డు



ఎస్కేడీ కాలనీలో నిర్మించిన కల్వర్టు



శివశంకర్ నగర్‌లో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

మారిన రూపురేఖలు

- ఆదోని 22వ వార్డులో అభివృద్ధి పరుగులు
- రూ.4.80 కోట్లతో పనులు
- ప్రతి వీధిలో రోడ్లు, తాగునీటి సమస్యకు పరిష్కారం
- నూతన శోభనను సంతరించుకున్న పాఠశాలలు, ప్రభుత్వ భవనాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న వార్డు ప్రజలు



నాడు-నేడు కింద నిర్మించిన వంటశాల

ఇది కదా.. అభివృద్ధి

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీ 22వ వార్డు అభివృద్ధి దిశగా పయనిస్తోంది. ఐదేళ్లలో వార్డులో సుమారు రూ.4.80 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయి. ప్రతి వీధిలో సీసీరోడ్లు, మురుగు కాలువలు, బీటీ రోడ్లు దర్శనమిస్తున్నాయి. తాగునీటి పైప్‌లైన్లు, కల్వర్టులు నిర్మితమయ్యాయి. అభివృద్ధి అంటే ఇది కదా అంటూ ప్రజలు చెప్పుకుంటున్నారు. మునుపెన్నడూ లేని విధంగా వైఎస్సార్‌సీపీ పాలనలో అభివృద్ధి జరిగిందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏరియాలు

మహాత్మాగాంధీనగర్, శివశంకర్‌నగర్, డీఎస్పీ బంగ్లా రోడ్డు, గర్ల్స్ హైస్కూల్ రోడ్డు ఏరియా, ఈఎస్ఐ ఆస్పత్రి, నీళ్ల ట్యాంకు ఏరియా, ఎస్కేడీ కాలనీ 3, 4, 5, 6 రోడ్లు.

అభివృద్ధి పనుల వివరాలు

- 22వ వార్డు పరిధిలో ప్రతి వీధిలో సీసీరోడ్లు, మురుగు కాలువలు, బీటీ రోడ్లు, తాగునీటి పైపులైన్లు, కల్వర్టులు ఏర్పాటు చేశారు.
- గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలతో గర్ల్స్ హైస్కూల్ మార్గంలో సీసీ రోడ్డు నిర్మించారు.
- రూ.8 లక్షలతో సీసీరోడ్డు, కుడా ఫండ్స్ రూ.16 లక్షలతో పార్కు కాంపౌండ్ వాల్ నిర్మించారు.
- రూ.3 లక్షలతో పార్కులో ఆట వస్తువులు కొనుగోలు.
- శివశంకర్‌నగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలతో సీసీరోడ్లు, మురుగు కాలువలు.
- నాడు-నేడు నిధులు రూ.18 లక్షలతో మహాత్మాగాంధీ నగర్‌లో పాఠశాల భవన నిర్మాణం.
- రూ.20 లక్షలతో శివశంకర్‌నగర్‌లో పాఠశాల భవనం, వంటగది నిర్మాణం.
- మున్సిపల్ జనరల్ ఫండ్స్ రూ.13 లక్షలతో బావి చుట్టూ కాంపౌండ్ వాల్.
- మున్సిపల్ జనరల్ ఫండ్స్ రూ.4 లక్షలతో 5 కల్వర్టులు ఏర్పాటు.
- నాడు-నేడు పథకం కింద గర్ల్స్ హైస్కూల్‌లో రూ.1.30 కోట్లతో అదనపు తరగతి గదులు, విద్యార్థులకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించారు.

22వ వార్డులో జనాభా

పురుషులు	-	2,600 మంది
స్త్రీలు	-	2,750
మొత్తం	-	5,350
పెన్షనర్లు	-	340

ప్రత్యక్ష నగదు బదిలీ

పథకం	లబ్ధిదారులు	విడుదలైన నగదు
జగనన్న అమ్మఒడి	999	4,59,40,907
జగనన్న విద్యాదీవెన	507	1,34,84,287
జగనన్న వసతిదీవెన	402	72,34,507
వైఎస్సార్ రైతుభరోసా	383	1,75,21,150
పంటల బీమా	237	30,67,936
సున్నావడ్డీ పంట రుణాలు (రైతులు)	60	1,78,248
ఇన్‌పుట్ సబ్సిడీ	10	1,18,550
వైఎస్సార్ పెన్షన్ కానుక	947	8,92,66,500
వైఎస్సార్ చేయూత	508	2,25,37,500
వైఎస్సార్ ఆసరా	937	1,87,76,890
వైఎస్సార్ సున్నావడ్డీ	1402	39,81,652
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	231	83,87,423
ఆరోగ్య ఆసరా	149	10,75,200
హౌసింగ్ (చెల్లింపులు)	199	1,55,08,315

పరోక్ష ప్రయోజనాలు

ఇంటి స్థలాలు	292	7,18,32,000
జగనన్న విద్యాకానుక	866	61,50,332
ట్యాబ్‌ల పంపిణీ	93	12,29,646
జగనన్న తోడు(రుణాలు)	186	34,63,134
జగనన్న గోరుముద్ద	833	82,52,531
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	630	1,17,99,900
ఇంటింటికి రేషన్	2051	4,48,02,044

70 శాతం పనులు పూర్తి చేశాం



ఐదేళ్లలో 22 వార్డులో అనేక అభివృద్ధి పనులు చేశాం. ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి సహకారంతో ప్రజల అవసరం మేరకు రోడ్లు, తాగునీరు తదితర సౌకర్యాలను కల్పించాం. సుమారు 70 శాతం పనులు పూర్తి చేశాం. నవరత్నాల పథకాల ద్వారా ప్రతి ఇంటికి లబ్ధి చేకూర్చాం. పెండింగ్‌లో ఉన్న మహాత్మాగాంధీనగర్‌కు సీసీ రోడ్డు వేశాం.

ఎస్.పి.లక్ష్మీదేవి, 22వ వార్డు కౌన్సిలర్

వార్డు బాగుపడింది



అభివృద్ధి పనులతో వార్డు రూపురేఖలు మారిపోయాయి.. రోడ్లు, కాలువలు, కల్వర్టులు తాగునీటి వసతి తదితర సౌకర్యాలు కల్పించారు. సంక్షేమ పథకాలతో మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో చేయూతనిచ్చింది. ఇలాంటి ప్రభుత్వం ఉంటే పేదలు సంతోషంగా ఉంటారు.

– రజియాబీ, స్థానిక మహిళ

మార్పు కనిపిస్తోంది



వార్డులో చాలా మార్పు కనిపిస్తోంది. అభివృద్ధి పనులు, మౌలిక వసతులు కల్పించారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేశారు. చాలా సంతోషంగా ఉంది. వార్డు కౌన్సిలర్, ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డికి కృతజ్ఞతలు.

–నగరూరు చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్కేడీ కాలనీ

శ్రీశైలానికి భక్తుల పాదయాత్ర



పాదయాత్రగా వెళ్తున్న భక్తులు



కొల్మాన్‌పేటలో భక్తులకు అన్నదానం



పాదయాత్ర భక్తుల కోసం చపాతీలు తయారు చేస్తున్న మహిళలు

కోసిగి: కర్ణాటక ప్రాంతానికి చెందిన వేలాది మంది భక్తులు శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జునస్వామి దర్శనార్థం కోసిగి మీదుగా తరలి వెళుతున్నారు. నాలుగు రోజులుగా భక్తుల రాక పెరిగింది. వందలాది కిలోమీటర్లు ఎండను సైతం లెక్కచేయకుండా మహిళలు, పెద్దలు, యువకులు, వృద్ధులు శివనామస్మరణ చేస్తూ భక్తిభావాన్ని చాటుతున్నారు. మరికొందరు కాళ్లకు కర్రలు కట్టుకుని, ఇంకొందరు మొడపై గారడి కంబీలను మోసుకుంటూ తరలివెళుతున్నారు. పాదయాత్ర భక్తులకు ఇబ్బందులు కలగకుండా సేవా దృక్పథంతో ప్రతి 5 కి.మీ పరిధిలో అన్నదాన కేంద్రాలు, పండ్లు, మజ్జిగ, పానీయాలు, భోజన వసతి ఏర్పాటు చేశారు. కొల్మాన్‌పేట, చైతన్య స్కూల్ సమీపంలో కొందరు దాతలు చపాతీలు, రొట్టెలు అక్కడే తయారు చేసి భక్తులకు వడ్డిస్తున్నారు. దీంతో పాదయాత్ర భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఇస్కాన్‌లో భగవద్గీత తరగతులు



ప్రత్యేక అలంకారంలో జగన్నాథ్, బలదేవ్, సుభద్ర



ప్రవచనం చెబుతున్న రఘునందన్ సేవక్ ప్రభు



హరే రామ హరే కృష్ణ సంకీర్తన చేస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో భగరీథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో ఆదివారం భగవద్గీత తరగతులు, శీల ప్రభుపాదుల ప్రేమ విందు నిర్వహించారు. జగన్నాథ్, బలదేవ్, సుభద్రలను అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఇస్కాన్ బాధ్యులు రఘునందన్ సేవక్ ప్రభు భగవద్గీతపై ప్రవచనం చెప్పారు. మానవ సంబంధాలు, ఉన్నత జీవనం సాగించేందుకు ఉపయోగ పడే అన్ని అంశాలు భగవద్గీతలో ఉన్నాయన్నారు. అనంతరం హరే రామ హరే కృష్ణ నామ సంకీర్తన చేశారు.

గడ్డివాములు దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

చిప్పగిరి: మండలంలోని బెల్డోణ గ్రామంలో ప్రమాదవశాత్తు నిప్పంటుకుని నాలుగు గడ్డివాములు దగ్ధమయ్యాయి. వివరాలు.. గ్రామానికి చెందిన గొల్ల రాముడు, కోనంకి వెంకటేష్ అనే రైతులకు చెందిన గడ్డి వాములకు నిప్పంటుకుని మంటలు వ్యాపించాయి. స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మంటలను అదుపు చేశారు. ఈలోపు గడ్డివాములు పూర్తిగా కాలిపోవడంతో రూ.2.5 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు. మంటల్లో చిక్కుకున్న ట్రాక్టర్‌ను బయటకు తెచ్చేందుకు ప్రయత్నించిన తిప్పయ్య, రాంబాబుకు గాయాలు కావడంతో గుంతకల్లులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

డివిజన్ కేంద్రాల్లోనే శిక్షణ తరగతులు నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ మహదేవప్ప

ఆదోని రూరల్: పోలింగ్ సిబ్బంది శిక్షణా తరగతులను డివిజన్ కేంద్రాల్లో నిర్వహించాలని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ బి.మహదేవప్ప, మండల ప్రధాన కార్యదర్శి బి.సుధాకర్‌బాబు అన్నారు. స్థానిక ఎస్టీయూ భవన్‌లో ఆదివారం ఆదోని, కౌతాళం మండలాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల పోలింగ్ సిబ్బంది శిక్షణా తరగతులను జిల్లా కేంద్రాల్లో నిర్వహించడం ద్వారా ఉపాధ్యాయులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. డివిజన్ కేంద్రాల్లో శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సీనియర్ నాయకుడు బి.వెంకోబ మాట్లాడుతూ.. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయులను పోలింగ్ విధుల నుంచి మినహాయింపు చేయాలని పోలింగ్ రిటర్నింగ్ అధికారులను కోరారు. ఎస్టీయూ జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి సుంకన్న మాట్లాడుతూ.. పోలింగ్ విధులకు హాజరయ్యే మహిళా ఉద్యోగులకు అన్ని సౌకర్యాలను కల్పించాలన్నారు. సమావేశంలో ఎస్టీయూ జిల్లా సభ్యులు బి.రామాంజనేయులు, రామకృష్ణ, రామ్మోహన్ రెడ్డి, షేక్షావలి, అంజనయ్య, ఆర్.బి.వెంకటేశులు, ఎస్.ఎస్.భాస్కర్, కోటేశ్వరయ్య, సత్యన్న తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డులో చలివేంద్రం ఏర్పాటు చేయాలి

ఆదోని అర్బన్: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులు, హమాలీలు, కూలీలను దృష్టిలో ఉంచుకుని యార్డు అధికారులు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. వేసవిలో ఎండ తీవ్రత పెరగడంతో యార్డులోని కొన్ని చోట్ల చలివేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, ప్రజలు, రైతుల దాహార్తిని తీర్చాలని కోరుతున్నారు.

సిద్ధేశ్వరుడిని తాకిన సూర్య కిరణాలు



గర్భగుడిలో విరాట్‌మూర్తిపై సూర్య కిరణాలు

హొళగుంద: మండల కేంద్రంలో వెలసిన సిద్ధేశ్వర స్వామి ఆలయ గర్భగుడిలో విరాటమూర్తిని ఆదివారం సూర్యకిరణాలు తాకాయి. సాధారణ రోజుల్లో కిరణాలు గుడి బయట వరకు పడుతున్నా ఈ తేదీల్లో మాత్రం ఆలయం శిఖరం నుంచి గర్భగుడిలో ప్రవేశించి స్వామి విరాటమూర్తులను తాకుతాయి. ఎప్పుడు చీకటిగా ఉండే గర్భగుడిలో సూర్య కిరణాలు లోపలి వరకు వెళ్లి స్వామిని తాకడం ఆశ్చర్యంగా ఉందని గ్రామస్తులు తెలిపారు. సూర్య కిరణాలు విరాటమూర్తిని తాకడం శుభ సూచకమని భక్తులు అంటున్నారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆలయాల్లో భక్తుల సందడి

మహానంది: మహానంది, ఓంకారం పుణ్యక్షేత్రాల్లో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. సెలవురోజు కావడంతో పలు ప్రాంతాల భక్తులు ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి, శ్రీ గంగా, ఉమా సమేత ఓంకారసిద్ధేశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణాల్లో భక్తుల రద్దీ నెలకొంది. ఓంకారంలో భక్తులు కాశినాయన అన్నప్రసాద కేంద్రంలో అన్నప్రసాదాలు స్వీకరించి ఆలయ ప్రాంగణాల్లో సేదతీరారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో మాళ మల్లేశ్వరస్వామి

హొళగుంద: బన్ని ఉత్సవాలకు ప్రసిద్ధి చెందిన దేవరగట్టులో ఆదివారం స్వామివారాన్ని పురస్కరించుకుని మాళ మల్లేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా పూజారులు ఆలయంలోని మూలవిరాట్‌లకు సుప్రభాత సేవ, అభిషేకాలు, రుద్రాభిషేకం, బండరార్చన, కుంకుమార్చన, మహామంగళారతి, నైవేద్య సంతర్పణతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. స్వామివారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వాహకులు అన్నదానం చేశారు.

వలంటీర్లను దూరం చేసింది చంద్రబాబే



కందుకూరులో వృద్ధురాలితో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కోసిగి: వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు వలంటీర్లతో ఇంటి వద్దే పింఛన్ల పంపిణీని దూరం చేసింది టీడీపీ నేత చంద్రబాబునాయుడు అని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డి అన్నారు. ఆదివారం కోసిగిలోని కామన్‌దొడ్డి, కందుకూరు, కడదొడ్డి, లక్ష్మీనగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతి నెలా ఒకటో తేదీ వలంటీర్ల ద్వారా ఇంటి వద్దే పింఛన్లు అందజేశారని తెలిపారు. ప్రభుత్వానికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక చంద్రబాబు నాయుడు ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లి వలంటీర్లను దూరంగా ఉంచిలా చేశారన్నారు. ప్రజలందరూ గమనించాలని కోరారు. త్వరలో జరిగే ఎన్నికల్లో ఓటుతో చంద్రబాబుకు గుణపాఠం చెప్పాలన్నారు. సంక్షేమ ప్రభుత్వానికి మరోసారి అండగా నిలవాలని కోరారు. పారదర్శక పాలనే జగనన్న లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బెట్టన గౌడ, ఎంపీపీ ఈరన్న, నాయకులు శ్రీనివాస రెడ్డి, జగదీష్‌స్వామి, బుళ్లి నరసింహులు, కోసిగయ్య, నాగరాజు, కామన్‌దొడ్డి సర్పంచ్ మునెమ్మ, నరసింహులు గౌడ, నబిరసూల్, తాయన్న తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలప్పుడు గుర్తుకు వచ్చామా?

పెద్దకడబూరు: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడుకు కురువలు, బోయలు ఎన్నికలప్పుడే గుర్తుకు వస్తారా అని కురువ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుడిసె శివన్న ప్రశ్నించారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న 14 ఏళ్లు గుర్తుకు రాని బోయలు, కురువలు ఈ రోజు గుర్తుకు రావడం విడ్డూరంగా ఉందన్నారు. బాబు అధికారంలో ఉన్నప్పుడు బోయలు ఎస్టీలుగా గుర్తించి ప్రాంతీయ వ్యత్యాసం తొలగించాలని పలుమార్లు విన్నవించినా కనీసం దగ్గరకు కూడా రానీయలేదని గుర్తు చేశారు. ఎమ్మిగనూరులో నిర్వహించిన ప్రజాగళం సభలో ఎస్టీలో చేర్చేందుకు కృషి చేస్తాననడం మసిపూసి మారేడుకాయ చేయడం తప్ప ఇంకోటి కాదన్నారు. ఇప్పటికైనా బోయలు, కురువలు ఉత్తుత్తి హామీలతో మోసం చేసే వారిని నమ్మవద్దని, భరోసా ఇచ్చి పనిచేసే వారినే నమ్మాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్



ప్రసంగిస్తున్న మత గురువు



ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు



కోసిగి: సిద్ధప్పపాలెం చర్చిలో..

ఆదోని సెంట్రల్: పట్టణంలోని ఆర్‌సీఎం చర్చి, సీఎస్ఐ హోలీట్రినిటీ చర్చి, సీఎస్ఐ, పెంతకోస్తు, ఇండిపెండెంట్ చర్చిలలో ఈస్టర్‌ను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఆయా చర్చిల్లో క్రైస్తవులు ప్రార్థనలు చేశారు. ఆర్‌సీఎం చర్చిలో కోలా విజయరాజు, సీఎస్ఐ చర్చిలో పాస్టర్లు భాస్కర్ బాబు, విలియం సుజిత్ దైవ సందేశాన్ని వినిపించారు. సర్వ మానవాళిని పాపం నుంచి విముక్తి కలిగించడానికి ఏసుక్రీస్తు మరణించి తిరిగి లేచిన దినమే ఈస్టర్ అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సాటి మనిషిపై ప్రేమ, దయ కలిగి ఉండాలన్నారు. క్రీస్తు బోధనలకు అనుగుణంగా నడుచుకోవాలని తెలిపారు.

ప్రత్యేక ప్రార్థనలు

కోసిగి: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కోసిగిలోని క్రీస్తు సంఘం, ఆర్‌సీఎం, సీఎస్ఐ చర్చిల్లో పాస్టర్లు ప్రేమ్‌కుమార్, రాజారత్నం, సుమిత్ర, చిదానంద, శ్రీనివాసులు క్రీస్తు బోధనలను వివరించారు. ఈస్టర్ విశిష్టతను తెలియజేశారు. చింతకుంట, పల్లెపాడు, డి.బెళగల్, దుద్ది, అగసనూరు, వందగల్లు తదితర గ్రామాల్లోని చర్చిల్లో ప్రార్థనలు చేశారు.

నిరాశ్రయులకు అల్పాహారం పంపిణీ



రైల్వేస్టేషన్‌లో అల్పాహారం పంపిణీ చేస్తున్న క్రైస్తవులు



వీధుల్లో పంపిణీ

ఆదోని సెంట్రల్: ఈస్టర్‌ను పురస్కరించుకుని నిరాశ్రయులు, అభాగ్యులకు క్రిస్టియన్ ఎంప్లాయిస్, ప్రొఫెషనల్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం అల్పాహారం అందించారు. సభ్యులు లూర్దయ్య, న్యూటన్ రాజు, సుధాకర్, ఆదిమూర్తి, బసప్ప తదితరులు కొత్త బస్టాండ్, రైల్వే స్టేషన్, ప్రధాన కూడళ్లలో తిరుగుతూ సుమారు 150 మందికి పంపిణీ చేశారు.